క్లుప్తంగా

ఎండాడలో సమ్మర్ క్యాంప్



విద్యార్థులతో జెడ్సీ కనకమహాలక్ష్మి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ అథ్లెటిక్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను జోన్ – 2 జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి గురువారం సందర్శించారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ అందిస్తున్న పౌష్టికాహారాన్ని ఆమె పిల్లలకు అందజేశారు. వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సంఘం చైర్‌పర్సన్ ఎస్.సీతామహాలక్ష్మి, సెక్రటరీ రాజేష్‌రెడ్డి, కోచ్ వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవానిపాలెంలో అంధకారం



గుడ్లవానిపాలెంలో లైట్లు వెలగక అలుముకున్న చీకటి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు గుడ్లవానిపాలెంలో గత మూడు నెలలుగా అంధకారం అలుముకుంది. ఈ ప్రాంతంలో వీధిలైట్లు లేక రాత్రి సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విత్తనాలు, ఎరువుల కోసం ప్రతిపాదనలు

ఆనందపురం : ఖరీఫ్ సీజన్‌కు అవసరమయ్యే వరి విత్తనాలు, ఎరువుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని వ్యవసాయాధికారి సంధ్యారత్న ప్రభ తెలిపారు. వివిధ రకాల విత్తనాలు 433 క్వింటాళ్లు, ఎరువులు 506 టన్నులు అవసరమవుతాయని గుర్తించామన్నారు. బీపీటీ 3291 (సోనామసూరి) 280 క్వింటాళ్లు, బీపీటీ 5204 (సాంబామసూరి) 120 క్వింటాళ్లు, ఎంటీయూ 1121 (శ్రీధృతి) 80 క్వింటాళ్లు, ఆర్‌జీఎల్ 25379 (శ్రీకాకుళం సన్నాలు) 33 టన్నులకు ప్రతిపాదనలు పంపించామని వివరించారు. ఎరువులు యూరియా 384 టన్నులు, డీఏపీ 62 టన్నులు, ఎంవోపీ 20 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 40 టన్నులు అవసరమవుతాయని గుర్తించి ప్రతిపాదనలు పంపించామన్నారు. 20 రోజుల్లో రైతులకు అందుబాటులో ఉంచుతామని వ్యవసాయాధికారి సంధ్యారత్న ప్రభ తెలిపారు.

చిట్టివలస విద్యార్థినికి తెలంగాణ ఎంసెట్‌లో 547వ ర్యాంకు



ఇట్లా భావన

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు చిట్టివలస ఆదర్శనగర్‌కు చెందిన ఇట్లా భావనకు తెలంగాణ ఎంసెట్ (అగ్రికల్చర్, మెడిసన్ స్ట్రీమ్)లో 547వ ర్యాంకు లభించింది. గురువారం విడుదలైన ఫలితాల్లో ఆమెకు 160 మార్కులకు 119.78తో ఈ ర్యాంకు వచ్చింది. గత ఏప్రిల్‌లో విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో 983 మార్కులు సాధించింది.

రక్తహీనత నివారణకు మాత్రలు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు గురువారం ఏఎన్‌ఎం మాదాబత్తుల స్వాతి ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. ఇటీవల హిమోగ్లోబిన్ పరీక్షల సందర్భంగా రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి సెలవు రోజుల్లో కూడా ఈ మాత్రలు వేసుకునేలా ప్రోత్సహిస్తున్నట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవా తత్పరులు వలంటీర్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- 271 మందికి ఘనంగా సత్కారం



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు, అధికారులు

పద్మనాభం: సచివాలయ వలంటీర్లు సేవా తత్పరులని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రెడ్డిపల్లిలో గురువారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓట్లు, ఎన్నికల కోసం కాకుండా మంచి ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ మోహన రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. సచివాలయాల ద్వారా ప్రజల చెంతకు సంక్షేమ పథకాలు అందించేందుకు ఒక్క సంతకంతో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిపి నాలుగు లక్షల మందికి ఉద్యోగులు, ఉపాధి కల్పించడం దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రజలకు నేరుగా సేవ చేసే అవకాశం వలంటీర్లకు జగన్ మోహన రెడ్డి కల్పించారన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హతనే ప్రామాణికంగా తీసుకుని 23 రకాల సంక్షేమ పథకాలను 95 శాతం మందికి అందించి అన్ని వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తి సీఎం జగన్ అని కొనియాడారు. భీమునిపట్నం నియోజకవర్గంలో 40 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. కరోనా వంటి కష్ట కాలంలో కూడా వలంటీర్లు ప్రాణాలకు తెగించి సేవ చేయడం గర్వకారణమన్నారు. జగన్ మోహన రెడ్డి మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు అమలవడంతోపాటు వలంటీర్ల వ్యవస్థ కొనసాగుతుందన్నారు. సొంత స్థలాల్లో జగనన్న కాలనీ ఇళ్లు కట్టుకునే వారికి తక్షణమే ఎల్‌పీసీలు ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఐదుగురు వలంటీర్లుకు సేవా రత్న, 264 మందికి సేవా మిత్ర, ఇద్దరికి సేవా వజ్ర అవార్డులు అందజేసి సత్కరించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీలు ఈర్ల రాజేశ్వరి, బోని బంగారునాయుడు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, తహసీల్దార్ టి.శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నాయకులు సిరుగుడి ఆదినారాయణ, ఈర్ల ఈశ్వర రావు, బూసురోతు అప్పారావు, మొకర అప్పల నాయుడు, బొలె అప్పలనాయుడు, బోని సన్యాసినాయుడు, చెల్లూరి పైడప్పుడు, మామిడి శివరామకృష్ణ, చందక శ్రీను, తాలాడ పద్మనాభం, సీర సూరప్పుడు, కోన రమణ, కర్రి శ్రీను పాల్గొన్నారు.

శ్మశానవాటికలో సౌకర్యాలు కరవు

అర్ధాంతరంగా వదిలేసిన నిర్మాణాలు



వెంకటాపురం శ్మశానవాటికలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు

ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి పంచాయతీ వెంకటాపురం శ్మశానవాటికలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. గతంలో ఇక్కడ చేపట్టిన నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో శ్మశాన వాటికలో నిలువ నీడ లేక అంతిమ సంస్కారాలు నిర్వహించే సమయంలో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్మశాన వాటిక బోని వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే ఉంది. వెంకటాపురం గ్రామస్తులు సుమారు కిలో మీటరు దూరంలో గల ఈ శ్మశాన వాటికకు చేరుకోవాల్సి ఉంటుంది. కాగా శ్మశాన వాటిక అంతా తుప్పలు, డొంకలతో నిండిపోయింది. దహన సంస్కారాలకు కూడా ఆటంకంగా ఉంది. ఇక్కడ నాలుగేళ్ల క్రితం మృత దేహాలను దహన పరచడానికి, సంబంధీకులు నిరీక్షించేందుకు రెండు నిర్మాణాలను ప్రారంభించారు. కానీ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రహరీ నిర్మాణం కూడా అర్ధాంతరంగా నిలిచిపోయింది. నిర్మాణాలు కూడా చాలా వరకు శిథిలమయ్యాయి. ఇక్కడ లైట్లు కూడా లేకపోవడంతో రాత్రి వేళ దహన సంస్కారాలు చేయాల్సి వస్తే చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశానంలో కనీస సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అందరి సహకారంతో బాల్య వివాహాల నియంత్రణ

ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు



మాట్లాడుతున్న అప్పారావు

భీమునిపట్నం: బాల్య వివాహాల దురాచారం ఇంకా పలుచోట్ల ఉందని, దాన్ని నిర్మూలించడానికి అందరూ సహకరించాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు కోరారు. స్థానిక మహిళ, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్), పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులతో బాల్య వివాహాల నిషేధ చట్టంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం అన్ని విషయాల్లో అభివృద్ధి చెందుతున్నా ఇంకా అనేక ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

తమకు ఫిర్యాదులు అందుతుండడంతో వివాహాలను అడ్డుకుంటున్నామని, కానీ పూర్తి స్థాయిలో ఆగడం లేదన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా జరుగుతుండడంతో అక్కడి ప్రజా ప్రతినిధులు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. ఎంపీపీ దంతులూరి వాసురాజు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎం.శ్రీదేవి, తహసీల్దార్ కె.వేణుగోపాల్, ఎంఈవో బాలామణి, ఎస్‌ఐ భరత్‌కుమార్, కమిషన్ సభ్యుడు గొండు సీతారాం పాల్గొన్నారు.

బాలల కోసం ప్రత్యేక చట్టాలు

బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని కేసలి అప్పారావు అన్నారు. ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్ ఆధ్వర్యంలో పేద వితంతువుల పిల్లల అభ్యున్నతికి నిర్వహిస్తున్న కుటుంబ బలోపేత కార్యక్రమంలో భాగంగా తల్లులకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. చిల్డ్రన్స్ విలేజ్ డైరెక్టర్ కె.రవీంద్ర మాట్లాడుతూ వితంతువులు స్వయం ఉపాధి పొందడానికి, వారి పిల్లల చదువులకు సహకరిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా బాగా చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు అందించారు. కుటుంబ బలోపేత కార్యక్రమ ఇన్‌చార్జి కె.దుర్గరాజు, బాలల హక్కుల ఫోరం మండల కన్వీనర్ ఎల్లయ్య పాల్గొన్నారు.

ఆనందపురం-బోని రోడ్డు మధ్యలో గోతులు



గొట్టిపల్లి కళ్లాలకు సమీపంలో రోడ్డు మధ్యలో ఉన్న గోతులు



చందక వద్ద తారు కొట్టుకుపోయి ఏర్పడిన గొయ్యి

ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు

ఆనందపురం : ఆనందపురం నుంచి బోని గ్రామానికి వెళ్లే మార్గంలో పలు చోట్ల రోడ్డు మధ్యలో ఏర్పడిన గోతులు ప్రాణాంతకంగా మారాయి. దగ్గరకు వచ్చే వరకూ కనిపించని విధంగా ఉన్న గోతుల వద్ద తరుచూ ప్రమాదాలు సంభవించి వాహన చోదకులు గాయాలపాలవుతున్నారు. గత కొంత కాలంగా పరిస్థితి ఇలాగే ఉన్నా అధికారులు చర్యలు చేపట్టడం లేదని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. మండలంలోని సుమారు 10 గ్రామాలకు ఉపయోగపడుతున్న ఈ రోడ్డు పద్మనాభం మండలం రోడ్డుకి అనుసంధానంగా ఉంది. దీంతో ఈ మార్గంలో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గతంలో అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సుమారు రూ.7 కోట్లతో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయించారు. ఒకప్పుడు 10 అడుగులే వెడల్పు ఉన్న ఈ రోడ్డుని 30 అడుగులు వెడల్పు చేశారు. అప్పటి నుంచి ఈ మార్గంలో ప్రయాణం ఎంతో సౌలభ్యంగా మారింది.

స్థానికుల నిర్లక్ష్యం... పైప్‌లైన్ లీకేజీతో...

కాగా చందక వద్ద రోడ్డుకు ఇరువైపులా నివాస గృహాలు ఉన్నాయి. అయితే మురుగునీరు పోవడానికి కాలువలు లేకపోవడంతో వాడుక నీటిని రోడ్డుపైకే విడిచి పెడుతున్నారు. దీంతో రోడ్డు పైనే నీరు నిల్వ ఉండిపోతుండడంతో తారు కొట్టుకుపోయి పెద్ద గొయ్యిలు ఏర్పడ్డాయి. గోతుల్లో నీరు చేరి మురుగు కూపంగా మారాయి. అలాగే గొట్టిపల్లి కళ్లాలకు సమీపంలో రోడ్డు కింద నుంచి ఉన్న గోస్తనీ వాటర్ వర్క్స్ పైప్‌లైన్ లీకవడంతో నీరు పైకి ఎగదన్నుతోంది. దీంతో రోడ్డు ఉపరితలం కొట్టుకుపోయి మధ్యలోనే గోతులు ఏర్పడ్డాయి. ఇక్కడ జీవీఎంసీ సిబ్బంది తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. దీంతో పరిస్థితి ఎప్పటిలాగే మొదటికి వస్తోంది. ఏడాదిగా ఇక్కడ ఇదే పరిస్థితి ఉంది. ఇక్కడ ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఒక వైపు నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళ ఈ రెండు ప్రాంతాల్లో ఉన్న గోతులు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు అందులో పడి గాయాలపాలవుతున్నారు. పెద్ద వాహనాలు కూడా అందులో కూరుకుపోయి ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న గోతులు పూడ్చి వేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

హృద్రోగులకు మెరుగైన సేవలు

కొమ్మాది: గీతం ఆస్పత్రిలో తాజాగా హృద్రోగులకు మెరుగైన సేవలు అందించడానికి అత్యాధునికంగా కేథ్ ల్యాబ్ (కేథరైజేషన్ ల్యాబొరేటరీ) ఏర్పాటు చేశారు. అన్ని రకాల గుండె జబ్బులకు చికిత్స అందించే విధంగా కోట్లాది రూపాయల వ్యయంతో గీతం అనుబంధంగా గల జిమ్సర్ ఆస్పత్రిలో ఈ సదుపాయాన్ని అపోలో ఆస్పత్రి కార్డియాలజీ విభాగం నిపుణులు డాక్టర్ బారువా, గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీ భరత్ ఆదివారం ప్రారంభించారు. గీతం బోధన ఆస్పత్రిలో పీజీ వైద్య విద్యను అభ్యసించే వారికి అత్యుత్తమ శిక్షణ ఇవ్వడంతోపాటు సామాన్యులు కూడా గుండె జబ్బుల చికిత్సకు ఇకపై దూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేదని భరత్ అన్నారు. కార్యక్రమంలో గీతం వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటకు చెందిన గరికిన భవానీ (25) అదృశ్యమైనట్లు ఆమె తల్లి గరికిన కొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళ్తే... భవానీకి పది సంవత్సరాల క్రితం విశాఖకు చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో మంగమారిపేటలో ఉన్న అమ్మగారి ఇంటికి వచ్చింది. తన తల్లి ఓ కళాశాలలో పనిచేస్తున్నారు. ఈ నెల 19న డ్యూటీ ముగించుకుని సాయంత్రం కొండ ఇంటికి వచ్చి చూసేటప్పటికి భవానీ కనిపించలేదు. ఆ రోజు నుంచి గాలించినప్పటికీ ఆచూకీ దొరక్కపోవడంతో గురువారం భీమిలి పోలీస్ స్టేషన్‌లో కొండ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదాల నివారణకు సంయుక్త తనిఖీలు



సంగివలస మూడు ఆలయాల వద్ద తనిఖీలు చేపడుతున్న ట్రాఫిక్, హైవే సిబ్బంది

తగరపువలస: భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో 16వ నంబరు జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు, నేషనల్ హైవే సిబ్బంది సంయుక్తంగా గురువారం తనిఖీలు నిర్వహించారు. సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయాలు, తాళ్లవలస, వేంకటేశ్వరమెట్ట వద్ద గోస్తనీనది, వలందపేట కూడళ్లలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించారు. ప్రమాదాలకు గల కారణాలపై చర్చించిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరాలు వెల్లడించారు. వాహనాల వేగాన్ని తగ్గించే రంబల్ స్ట్రిప్స్, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డులు, స్కూల్ జోన్ బోర్డులు, సోలార్ బ్లింకర్లు, కేట్ ఐ, సర్వీస్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఎక్కడెక్కడ అవసరమో గుర్తించారు. వీటి నిర్వహణకు అశోకా బిల్డర్స్ ప్రతినిధి రామస్వామితో మధురవాడ జోన్ ట్రాఫిక్ సీఐ ఎస్.సాయి, భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవి, నేషనల్ హైవే ప్రతినిధి భార్గవ్ చర్చించారు. వాహనాల సిబ్బంది కూడా ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

రూ.3 లక్షలతో రజకుల కమ్యూనిటీ హాలు నిర్మాణం



రాయపాలెంలో కమ్యూనిటీ హాలు పనులు పర్యవేక్షిస్తున్న నాయకులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు రాయప్పాలెంలో నిధులు లేక పదేళ్ల క్రితం నిలిచిపోయిన రజకుల కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా రాయప్పాలెంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పర్యటించారు. ఆ సమయంలో రజకులు కమ్యూనిటీ హాలు సమస్యను ఆయనకు వివరించారు. దీంతో ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయగా నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో రజకులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన వైఎస్సార్‌సీపీ 2వ వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, కరుణాకరరెడ్డి, వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను చిల్ల భాస్కరరెడ్డి, చిప్పాడ వెంకటేష్, శీరపు శ్రీరాములు, తోణంగి ఎల్లాజీ, సరగడ నాగిరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, శీరపు అప్పారావు తదితరులు పరిశీలించారు.

పబ్లిక్ డిమాండ్

బక్కన్నపాలెంలో డ్రైనేజీ అవస్థలు



బక్కన్నపాలెం బీసీ కాలనీలో వ్యర్థాలతో నిండిపోయిన డ్రైనేజీ

మధురవాడ : జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెం బీసీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రామాలయం వెనుక ప్రాంతం బీసీ కాలనీలో మురుగునీరు సక్రమంగా వెళ్లడం లేదు. పైగా కాల్వలు కూడా సవ్యంగా లేవు. మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి దోమలు, ఈగలు పెరిగిపోయి చాలా మంది వ్యాధులతో బాధపడుతున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నాం. అధికారులకు, సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా పూడిక తొలగించడం లేదు. చిన్నపాటి వర్షం కురిసినా మురుగు నీరు అంతా రోడ్డుపైకి వచ్చేస్తోంది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలి.

– రామారావు, బక్కన్నపాలెం

కుళాయిల కోసం డ్రైనేజీని పూడ్చేశారు



తాటితూరు ఎస్సీ కాలనీలో పూడికపోయిన డ్రైనేజీ

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు ఎస్సీ కాలనీలో ఇంటింటికీ కుళాయిల నిర్మాణానికి నెల రోజుల క్రితం గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బంది పైపులైన్ కోసం గోతులు తవ్వి మట్టిని డ్రైనేజీలో వేసేశారు. దీంతో మురుగునీటి ప్రవాహానికి ఇబ్బందిగా మారింది. దుర్వాసన, దోమలతో ఎస్సీ కాలనీవాసులు ఇబ్బంది పడుతూ స్థానిక సచివాలయ సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. భీమిలి ఎంపీడీవో, పంచాయతీ విస్తరణ, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి సత్వరమే చర్యలు చేపట్టాలి.

– భాగం సుధాకర్, తాటితూరు

దళారీ వ్యవస్థకు చెక్

- మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో రైతులకు ఆర్థిక ప్రయోజనం
- క్వింటాకు రూ.1,962 మద్దతు ధర



కృష్ణాపురం కొనుగోలు కేంద్రంలో మొక్కజొన్న బస్తాలు



మొక్కజొన్న తేమ శాతం చూస్తున్న సిబ్బంది

పద్మనాభం: ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో దళారీ వ్యవస్థకు అడ్డుకట్టపడింది. మరోవైపు రైతులు పండించిన పంటకు మద్దతు ధర లభించడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రబీ సీజన్‌లో రైతులు 1,466 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. ఈ విస్తీర్ణంలో సుమారు 4,104 టన్నుల దిగుబడి వస్తుంది. కృష్ణాపురం, మద్ది, విలాస్కాన్‌పాలెం, బాందేవుపురం, పాండ్రంగి, కురపల్లి, గంధవరం, పొట్నూరు, ఐనాడ గ్రామాల్లో రైతులు ఈ పంట వేశారు. పంట పక్వానికి రావడంతో మొక్కజొన్నలను సిద్ధం చేశారు. ఈ క్రమంలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట దళారీ వ్యాపారుల పాలు కాకుండా అన్నదాతలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మండలంలో నాలుగు చోట్ల మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

కేంద్రాల్లో అమ్మితే అధిక ఆదాయం

ఈ కేంద్రాల్లో మొక్కజొన్నలు అమ్మే రైతులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలి. ప్రభుత్వం క్వింటాకు మద్దతు ధర రూ.1,962 చెల్లిస్తుంది. 14 శాతం లోపల తేమ ఉండాలి. అదే గ్రామాల్లోకి వచ్చే దళారీ వ్యాపారులు క్వింటాకు రూ.1,750 మాత్రమే ఇస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలకు అమ్మితే రైతులకు అధిక ఆదాయం సమకూరుతుంది. సాధారణంగా ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. వీటికి ప్రభుత్వ కేంద్రాలకు అమ్మితే అధిక ఆదాయంతోపాటు నేరుగా బ్యాంకు ఖాతాల్లో వారం నుంచి 10 రోజుల్లో డబ్బులు జమవుతాయి. అదే దళారీలకు అమ్మితే ఎకరాకు రూ.7,500 నష్టపోవాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. ఇప్పటికే పద్మనాభం వైఎస్సార్ క్రాంతి పథ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కృష్ణాపురం కేంద్రానికి 20 టన్నుల సరకు వచ్చింది.

కేంద్రం ఏర్పాటు చేసిన ప్రాంతం	ట్యాగ్ చేసిన గ్రామాలు
పొట్నూరు ఆర్బీకే కృష్ణాపురం ఆర్బీకే పాండ్రంగి ఆర్బీకే బాందేవుపురం	రెడ్డిపల్లి, తునివలస, కృష్ణాపురం, ఐనాడ కోరాడ, పాండ్రంగి మద్ది, గంధవరం, విలాస్కాన్‌పాలెం

ఎకరాకు రూ.5 వేలు అదనం



ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి మొక్కజొన్నలు అమ్మితే అధిక ఆదాయం సమకూరుతుంది. ఎకరాకు రూ.5000 అదనంగా వస్తుంది. నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాం. దీనిలో పండిన పంట అంతా కేంద్రానికి విక్రయించాం.

– ఎం.అప్పన్న, కృష్ణాపురం

డబ్బులకు పూర్తి గ్యారంటీ



ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి మొక్కజొన్నలు అమ్మడం వల్ల డబ్బులకు పూర్తిస్థాయిలో గ్యారంటీ ఉంటుంది. నేరుగా రైతు ఖాతాల్లో జమ అవుతాయి. డబ్బులు పోతాయనే భయం ఉండదు. అదే దళారీ వ్యాపారులకు అమ్మితే గ్యారంటీ ఉండదు.

– ఎస్.బంగారునాయుడు, కృష్ణాపురం

ట్రాఫిక్ రూల్స్ పాటించండి



బీచ్ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఏసీపీ శివరామిరెడ్డి, సిబ్బంది

కొమ్మాది: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, అప్పుడే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని ఏసీపీ శివరామిరెడ్డి సూచించారు. భీమిలి బీచ్ రోడ్డు జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట వద్ద గురువారం రాత్రి వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. ట్రిపుల్ రైడింగ్ చేసిన ఒకరిపై, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరిపై కేసు నమోదు చేశారు. లైసెన్స్, హెల్మెట్ లేని పది మందికి జరిమానా విధించారు. సీఐ లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.